తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలు

## - జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు



చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అనంతరం ఎన్నికల కమీషన్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు తమ విధులు నిర్వర్తించాల్సి వుంటుందని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని జెసి కార్యాలయంలో బుధవారం జెసి పి.శ్రీనివాసులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ జనవరి 22న ఫైనల్ ఎలక్టోరల్ రోల్ పబ్లిష్ చేయడం జరిగిందని, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా పరిశీలన నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన మేరకు అధికారుల నియామకాలు దాదాపు పూర్తి అయ్యిందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి 1,500 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, ఇందుకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో బిఎస్పీ నాయకులు భాస్కర్, కాంగ్రెస్ నాయకులు పరదేశి, సిపిఎం నాయకులు నాగరాజు, వైఎస్ఆర్‌సిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్, టిడిపి ప్రతినిధి ప్రభుతేజ, ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ ప్రసాద్‌బాబు, ఇతదితరులు పాల్గొన్నారు.

### తరలిపోతున్న కోట్లు విలువ చేసే...

# తెల్లరాయి!

- యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- ప్రకృతి సంపదను కరిగించేస్తున్న వైనం
- ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల్లో నష్టం
- కన్నెత్తి చూడని పలు శాఖల అధికారులు



తెల్లరాయిని తవ్వేస్తున్న దృశ్యం (ఫైల్ ఫోటో)

గూడూరు రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : చూస్తుండగానే సహజ వనరులు ధ్వంసమవుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ భూములు, కొండల్లో మట్టి, ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు తెల్లరాయి (వైట్ క్వార్ట్జ్)ను కొన్నాళ్లుగా దోపిడీ వనరుగా మార్చుకున్నారు. గూడూరు రూరల్ పరిధిలో కోట్ల రూపాయల విలువైన సంపద విదేశాలకు తరలిపోతోంది. అధికార పార్టీ నేతల హస్తం ఉండటంతో యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గూడూరు రూరల్ మండలంలో ఇప్పటివరకు ఇసుక, మట్టి మాఫియాలు చెలరేగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ క్రమంలోనే మరో నూతన మాఫియా గూడూరు రూరల్ మండలంలో చెలరేగిపోతోంది. విలువైన తెల్లరాయి యథేచ్ఛగా తరలిస్తూ మాఫియా దందా కొనసాగిస్తోంది. గూడూరు మండలం అయ్యవారిపాలెం, కాంద్ర, కొండగుంట, వెడిచర్ల, వెందోడు, మేఘనూరు పంచాయతీలలో విలువైన కోట్ల రూపాయల తెల్లరాయి రాత్రి పగలు అనే తేడా లేకుండా నిరంతరం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఏ రాయి తరలించాలన్నా గనులశాఖ, రెవెన్యూ శాఖల అనుమతి తప్పనిసరి. రాయి తరలించే వ్యక్తులు ముందుగా ఖనిజ శాఖ, జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులకు అనుమతి కోసం దరఖాస్తు చేయాలి. అనంతరం ఆ ప్రాంతం ఏ మండల పరిధిలో ఉంటే ఆ మండల రెవెన్యూ అధికారులు ఆ భూమిని పరిశీలించి రాయి తరలింపునకు అనుకూలమా లేదా అని ధ్రువీకరించాల్సి ఉంది. ఇప్పటివరకు తహసీల్దార్ కార్యాలయంలో ఎలాంటి ఫైల్ లేకపోవడం చూస్తుంటే ఎలాంటి అనుమతి లేకుండా నిరంతరం తెల్లరాయి తరలిస్తున్నారని స్పష్టమవుతోంది. అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రకృతి సంపద అయిన తెల్లరాయిని లోడ్ల కొద్దీ తవ్వేస్తున్నారు. మార్కెట్‌లో ఒక లోడ్ రూ.5లక్షల వరకు పలుకుతోంది. రోజుకు 20లోడ్ల వరకు సరిహద్దులు దాటించేస్తున్నారు. ఇలా ప్రకృతి సంపదను దిగమింగుతున్నా అడిగే నాథుడే కరవయ్యారు. అరుదైన ఖనిజాలకు ప్రసిద్ధిగాంచిన గూడూరులో వాటిపై కన్నేసిన అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా తవ్వేస్తూ అక్రమంగా కోట్ల రూపాయలు విలువ చేసే తెల్లరాయిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూకోట్లు గడిస్తున్నారు. అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ వారి ప్రయోజనాలు వారు పొందుతూ మౌనవ్రతాన్ని పాటిస్తున్నారు. స్థానికంగా ఎవరైనా వ్యతిరేకించినా అక్రమార్కుల దౌర్జన్యం ముందు ఆగలేని పరిస్థితి. తెల్లరాయి అక్రమ రవాణాను అడ్డుకోకపోతే ఈ ప్రాంతంలో మిగిలేది వ్యర్థపు రాళ్లేనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. గిరిజనుల భూముల్లో అభం శుభం తెలియని గిరిజనులను మాయ చేసి ఎకరాకు వెయ్యి నుంచి రెండువేల రూపాయలు వరకు ఎరచూపి ఆ భూముల్లో తెల్లరాయిని తరలించేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ రవాణాపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### రాష్ట్రంలోనే తొలిసారిగా పుంగనూరు మున్సిపాలిటీ నుంచి...

# సోలార్ విద్యుత్ ఉత్పాదన

- -రూ.6కోట్లతో ప్లాంట్ నిర్మాణం పూర్తి
- -మంత్రి పెద్దిరెడ్డిచే నేడు పుంగనూరులో ప్రారంభం



పుంగనూరులో సోలార్ పవర్ ప్రాజెక్టు

పుంగనూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : స్థానిక వనరులతో స్వయం ఉత్పాదక దిశగా పురపాలక సంఘాలు ప్రయాణించినపుడే పట్టణాలు అభివృద్ధిని సాధించగలవనే వాస్తవాన్ని నిరూపిస్తూ రాష్ట్రంలోనే తొలిసారిగా, పుంగనూరు మున్సిపాలిటీ ఒక మెగావాట్ సోలార్ విద్యుత్‌ను గురువారం నుంచి అందించనుంది. రాష్ట్రమ ంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన స్వంత నియోజక వర్గ కేంద్రమైన పుంగనూరు పట్టణంలో నేడు ఈసోలార్‌పవర్ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేయనున్నారు. వివరాలిలా ఉన్నాయి. లక్షకుపైగా జనాభాకల పుంగనూరు పట్టణానికి మంచినీటిని అందించేందుకు మంత్రి పెద్దిరెడ్డి చొరవతో సమ్మర్ స్టోరేజి టా ్యంకును అందుబాటులోనికి తీసుకు వచ్చారు. కృష్ణానదీ జలాలను హంద్రీనీవా కాలువద్వారా పట్టణానికి చేర్చి, ఇక్కడ నిర్మించిన సమ్మర్‌స్టోరేజి ట్యాంకు ద్వారా శుద్ధిచేయబడిన మంచినీటిని పట్టణానికి అందించేందుక ఉద్దేశించబడిన పథకం ఇది. ఈప్రాజెక్టు పూర్తి కాబడినవెంటనే, ఈప్రాజెక్టు వెంబడి నాలుగువైపులా సోలార్ ప్యానెల్స్ నిర్మించి పట్టణం మొత్తానికి విద్యుత్‌ను సరఫరాచేసేందుకు కార్పొరేట్ సోషియల్ రెస్పాన్స్ పథకం ద్వారా రూ.6కోట్లతో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తిచేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అనుకున్న సమయంలోనే ట్యాంకు వెంబడి సోలార్ పానెల్స్ పూర్తిచేయడంతో పాటూ,ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఒక మెగావాట్ విద్యుత్‌ను స్థానిక విద్యుత్ సరఫరా విభాగ సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేస్తారు. దీంతో సోలార్ ద్వారా అందిన విద్యుత్‌ను పట్టణానికి వినియోగించుకోడానికి అవకాశం ఏర్పడింది. స్థానికంగా మున్సిపాలిటీ పరిధిలో ప్రతినెలా రూ.15లక్షల వరకు విద్యుత్‌శాఖకు బిల్లులు చెల్లిస్తున్నారు. వీధిదీపాలు,నీటి సరఫరాతో పాటూ అనేక అంశాలకు ప్రతిఏటా రూ.1.80లక్షల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. మంత్రి చొరవతో ఏర్పాటయిన ఈసోలార్ ప్లాంటు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తోనే పట్టణావసరాలు తీరుతాయి. దీంతో ప్రతిఏటా రూ.180కోట్ల రూపాయలను మున్సిపాలిటీ ఆదాచేయబోతోంది. విద్యుత్‌బిల్లులు ఆదా కావడంతో మిగిలిన మొత్తాన్ని పట్టణంలో అభివృద్ధిపనులకు కేటాయించడానికి అవకాశం ఏర్పడింది. పట్టణాభివృద్ధికి మంచి నిర్ణయాత్మకమైన వనరు చేకూరడంతో ఇపుడు పుంగనూరు మున్సిపాలిటీ రాష్ట్రంలోనే స్వయం ఉత్పాదక సోలార్‌పవర్ ప్లాంటునిర్వహిస్తున్న ఏకైక మున్సిపాలిటీగా రికార్డు సాధించింది. ఈప్లాంట్‌ను మం త్రిపెద్దిరెడ్డి గురువారం ప్రజలకు అంకితం చేయనున్నారు.

# రేపే మినీబ్రహ్మోత్సవం

## -ఒకేరోజు ఏడువాహనాలపై మలయప్ప



తిరుమల,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి: సప్తగిరులపై సూర్యజయంతి పురస్కరించుకుని రేపు ఒకేరోజు ఏడు వాహనాలపై ఏడుకొండలదేవుడు కటాక్షించనున్నారు. మాఘమాసంలో సప్తమితిధి అత్యంత విశిష్టమైనది. ఆ రోజు దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి ఉదయం సూర్యప్రభ వాహనం నుండి రాత్రి చంద్రప్రభవాహనం వరకు ఏడువాహనాలపై అధిరోహించి ఊరేగుతారు. శ్రీవారి ఉత్స వమూర్తి మలయప్పస్వామి శ్రీదేవి భూదేవి ఉభయనాంచారులతో కలసి పలు వాహనాలపై విహరిస్తారు. శుక్రవారం ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభతో మొదలై వరుసగా పెద్దశేష వాహ నం, చిన్నశేష వాహనం, గరుడవాహనం, చక్రస్నానం, చంద్రప్రభ వాహనంతో ముగుస్తాయి. భక్తుల కోసం ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీలు, షెడ్లు, తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, ఆల యం పరిసరాల్లో రంగవల్లులు తీర్చిదిద్దారు. ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభ వాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్స వం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలు జరుగుతాయి.

# చారిత్రక బుగ్గ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం

## - టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి



నగరిలో టీటీడీ కల్యాణ మండపం శిలఫలకాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్

నగరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: బుగ్గ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయం చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలయమని పవిత్రమైన ఈ ప్రాంతంలో పెళ్లిళ్ళు చేసుకునే అవకాశం స్థానిక ప్రజలకు కల్పించాలన్న సంకల్పమే నేడు టీటీడీ కల్యాణ మండపం ఈ ప్రాంతంలో రావడానికి కారణమైందని మంత్రి రోజా అన్నారు. బుధవారం ఆలయ ఆవరణలో రూ.2 కోట్ల నిధులతో నిర్మించే టీటీడీ కల్యాణ మండపానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డితో కలసి ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుపొందిన పవిత్ర స్థలంలో ఒక కల్యాణ మండపం ఉంటే బాగుంటుందన్నది పరిసర ప్రాంత ప్రజల నాలుగు దశాబ్దాల కల అన్నారు. తాను ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు ఈ అంశాన్ని తన దృష్టికి తెచ్చేవారన్నారు. గత ప్రభుత్వాలు ప్రయత్నించినా అది సఫలీకృతం కాలేదన్నారు. కలియుగదైవం వెంకటేశ్వరుని కటాక్షంతో తన గురువు టీటీడీ చైర్మన్ శ్రీ భూమన కరుణాకర్‌రెడ్డి ఆశీర్వాదంతోనేడు టీటీడీ కల్యాణ మండపానికి భూమిపూజ చేయడంతో వచ్చిన ఆనందం మాటల్లో వర్ణించలేనిదన్నారు. చారిత్రకత విశిష్టత ఉన్న ఈ ఆలయంలో కాశీ నుంచి నీరు భూగర్భంలో వచ్చి ఇక్కడి దొణల్లో వస్తుందన్నది ప్రతీతన్నారు. ఇలాంటి పవిత్రమైన స్థలంలో పెళ్లిళ్ల జరిగితే ఆ జంట కలకాలం సంతోషంగా ఉంటుందన్న మంచి మనసుతో నేడు పవిత్రమైన కార్యక్రమం వసంత పంచమిని రోజున నిర్వహించడం జరిగిందన్నారు. ఆలయం పురావస్తు శాఖ పరిధిలో ఉండడంతో అభివృద్ధి చేయలేకపోతున్నామని కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి టీటీడీ అభివృద్ధి చేస్తుందని నమ్ముతున్నా నన్నారు. రూమ్స్ కూడా మంజూరు చేయాలని కోరుతున్నానన్నారు.

**చారిత్రక బుగ్గ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం :**

చారిత్రక బుగ్గ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. టీటీడీ కల్యాణ మండపం భూమిపూజకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేడు మహత్తర కార్యక్రమానికి హాజరు కావడం ఆనంద దాయకమన్నారు. అతి తక్కువ ఖర్చుతో స్థానిక ప్రజలు వివాహం జరిపించుకునే అవకాశాన్ని కల్పించాలన్న మంత్రి రోజా భగీరథ ప్రయత్నం నేడు ఫలించిందన్నారు. ఉన్నది ఉన్నట్లు నిజాయితీగా మాట్లాడే వ్యక్తి మంత్రి రోజా అన్నారు. ఆమె అడిగిన మరిన్ని అభివృద్ధి పనులు కూడా ఆమె నుంచి ప్రతిపాదనలు రాగానే వంద శ్రాతం నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. పురాతణమైన ఆలయాల విషయంలో టీటీడీ నిధులు కేటాయించడంలో స్పష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో నాగ రత్నమ్మ, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అధికారులు, నియోజకవర్గంకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలకు ప్రోత్సాహం : కలెక్టర్



జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: విద్యార్థుల్లో విజ్ఞానపరంగా వినూత్న ఆలోచనలను ప్రోత్సహిం చాలని, ఉపాధ్యాయులు దీనికి అనుగుణంగా విద్యాబోధన చేపట్టాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పిలుపునిచ్చారు. చిత్తూరు పిఇఎస్ పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ సగిలి షన్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, వాటి సాఫల్యతకు ఊతమిచ్చే ఉద్దేశంతో భారత ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డిఎస్‌టి) ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ మనక్ అనే పథకం ద్వారా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం ఈ నెల 14 నుండి 16వ తేదీ వరకు చిత్తూరు పిఇఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 10 నుండి 15 సంవత్స రాల వయసు గల అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6-10 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను పెంపొందించడం, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథంను పెంపొందించడం, శాస్త్రీయ ప్రతిభను వెలికి తీసి విద్యార్థుల పరిశోధనల వైపు ఆకర్షితులు చేయాలన్నారు. అలాగే విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన వారిని జిల్లా స్థాయి, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర స్థాయి, రాష్ట్ర స్థాయి ఎంపిక కాబడిన వారిని జాతీయ స్థాయికి పంపడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దాగి వున్న సృజనాత్మక ఆలోచనలకు కార్యరూపం దాల్చుస్తూ వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు ఈ పోటీలు దోహదపడుతాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఇఓ దేవరాజు, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి, ఎడి విజయేంద్రరావు, చిత్తూరు డివైఇఓ చంద్రశేఖర్, జిల్లా సైన్స్ అధికారి రమణ, విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కాణిపాకంలో వైభవంగా అక్షరాభ్యాసం

## -కిక్కిరిసిన ఆస్థానమండపం



కాణిపాకం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మాఘ శుద్దపంచమి (వసంత పంచమి) సందర్భంగా సత్య ప్రమాణాల దేవుడు కాణిపాకం శ్రీవినాయకుని చెంత బుధవారం భారీ ఎత్తున అక్షరాభ్యాసం కార్యక్రమాలు జరిగాయి. విఘ్న నాధుడైన వినాయకుని చెంత తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తే అంతా శుభమే కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీనికి తోడు వసంతపంచమి శుభదినం కావడంతో కాణిపాకం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక అక్షరాభ్యాసం కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తమ పిల్లలకు విఘ్ననాధుని చెంత ఓనమాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు. ప్రతిరోజూ ఆలయంలో పదుల సంఖ్యలో మాత్రమే అక్షరాభ్యాసంలు జరుగుతుంటాయి. అయితే బుధవారం వసంత పంచమి మంచి ముహూర్తం కావడంతో గణనాధుని చెంత అక్షరాభ్యాసం చేయించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆస్థానం మండపం పూర్తిగా నిండిపోయింది. ఇందులో భాగంగా ఉదయం ప్రధాన దేవాలయం నుండి సిద్ధి,బుద్ధి సమేత వినాయక స్వామివారిని,సరస్వతీ దేవి అమ్మవారి ఉత్స వ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆస్థాన మండపంకు తీసకువచ్చారు. అనంతరం వేదపండితుల మత్రోచ్చారణ నడుమ అర్చకులు సరస్వతీ యాగం నిర్వహించారు. అనంతరం అశేషంగా తరలివచ్చిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.బుధవారం ఒక్క రోజు మాత్రమే ప్రత్యేక అక్షరాభ్యాసం కార్యక్రమం ద్వారా 635 టిక్కెట్‌లు కొనుగోలు చేసి తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అక్షరాభ్యాసంకు భారీ ఎత్తున భక్తులు తరలిరావడంతో అలంకారమండపం పూర్తిగా నిండిపోయింది. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



కాణిపాకంలో వైభవంగా జరిగిన అక్షరాభ్యాసం కార్యక్రమం

# శ్రీకాళహస్తి వైకాపాకు జడ్పిటిసిల షాక్!

## -ముగ్గురు చంద్రబాబు సమక్షంలో తెలుగు దేశంలో చేరిక



చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీలో చేరిన వైకాపా జడ్పిటిసిలు

శ్రీకాళహస్తి/తొట్టంబేడు/శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపాకు భారీ షాక్ తగిలింది. బుధవారం తెలుగుదేశం రథసారధి, పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో శ్రీకాళహస్తి నియోజవర్గానికి చెందిన శ్రీకాళహస్తి,ఏర్పేడు, తొట్టంబేడు మండలాల జడ్పిటిసిలు వైకాపాకు బై బై చెప్పి తెలుగుదేశం కండువాలను కప్పుకున్నారు. మారుతున్న రాజకీయ వాతావరణంతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తిరుగులేని వైకాపాకు తిరుగుబాట్ల సెగ తగులుతుంది. ఓ వైపు రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికార పార్టీ నాయకులు ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి, ఆయన తనయ బియ్యపు పవిత్రారెడ్డి, సతీమణి బియ్యపు శ్రీవాణి విస్తృతంగా ప్రచారంలో తలమునకలౌతుండగా ఆ పార్టీకి చెందిన జడ్పిటిసిలు గుడ్‌బై చెప్పటం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంను ప్రతిపక్ష పార్టీ లేని విధంగా తీర్చి దిద్దుటకు శాసనసభ్యుడు ప్రయత్నిస్తుండగా, షాక్ ఇస్తూ తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి పావులు కదుపుతున్నారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండల జడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి, తొట్టంబేడు మండల జడ్పిటిసి అర్చనాదేవి,ఏర్పేడు జడ్పిటిసి తిరుమలయ్యలు వైకాపాకు గుడ్‌బై చెప్పారు. వీరందరూ వైకాపాలో ఏక గ్రీవంగా ఎన్నికైన వారే.అయితే కారణాలు ఏమిటో ఏమో కాని ఎంఎల్ఏతో ఎంతో సఖ్యతగా ఉన్న వారు పార్టీని వీడటం చర్చనీయాంశంగా మారింది. అలాగే మాజీ తొట్టంబేడు జడ్పిటిసి పన్నీరుకాల్వ వెంకటాచలం పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఇక డాబా హరి దంపతులు కూడా సుధీర్‌రెడ్డి సారథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీ తీర్థాన్ని పుచుకున్నారు.ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు కొత్తగా పార్టీలో చేరిన వారికి దిశ దెశ నిర్ధేశం చేస్తూ రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే అని మీ సేవలను సద్దినియోగం చేసుకుంటామని భవిష్యత్తులో మీకు మంచి గుర్తింపు ఉంటుందని వివరించినట్లు తెలిసింది. సుధీర్‌రెడ్డి నియోజక వర్గంలో పార్టీని బలోపేతం చేసుకోవటానికి పావులు కదుదుపుతున్నారు. రాబోవు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని వివరించారు.

## శివయ్య సేవలో విద్యుత్‌బోర్డు చైర్మెన్



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం విద్యుత్ బోర్డు రెగ్యులర్ ఆథారిటి చైర్మెన్ జస్టిస్ సివి నాగార్జున్‌రెడ్డి కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్లసేవలో పాల్గొన్నారు. ప్రోటోకాల్‌మేరకు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, వేదపండితులు, ప్రోటోకాల్ ఎఇఒ సతీష్‌మాలిక్‌లు స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయం దర్శనాలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఎఇఒ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, సుదర్శనం రెడ్డి,ఎపి ట్రాన్స్కో సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులకు పర్సు అప్పగింత!



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి తెలంగాణ నుంచి వచ్చిన శ్రీనివాసరావు దంపతులు క్యూలైన్లలో పర్సును దారబోసుకున్నారు. ఈ పర్సు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్‌కు దొరికింది. దానిని ఆలన ఎస్‌పిఎస్ సిబ్బందికి అందించారు. వారు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో ఎస్‌పిఎఫ్ సిబ్బంది పర్సును తీయగా అందులో నాలుగు సవర్ల బంగారుతో పాటు నగదు 3వేలు ఉన్నట్లు గుర్తించారు.మైకులో ప్రకటించి శ్రీనివాసరావు దంపతులను వివరాలు అడిగి నిర్ధారించుకొని అప్పగించారు. ఆలయ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ జవాబుదారి తనాన్ని బాధితులతో పాటు చైర్మెన్ శ్రీనివాసులు ప్రసంశించారు.

## రైతులకు ఎస్ ఎస్ కెనాల్ ద్వారా సాగు నీళ్ళు:రిషితారెడ్డి



**శ్రీకాళహస్తి రూరల్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి మండల రైతుల చిరకాల వాంఛ అయిన ఎస్.ఎస్ కెనాల్ పూర్తి చేసి రైతులు త్వరలోనే నీరందిస్తామని సుమారు లక్ష ఎకరాలకు అదనపు సాగునీరందిస్తామని రిషితారెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి సుమారు 3 నెలల నుంచి మండలాల్లో పర్యటించి పార్టీ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నేపధ్యంలో బుధవారం ఆమె శ్రీకాళహస్తి మండలంలోని వెలం పాడు, నిమ్మరాళ్ళపల్లి, రాజుగుంట, రేపల్లె గ్రామాల్లో ఇంటింటికి పర్యటించారు.ఈ సందర్భంగా ఈ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను గుర్తించి ఈ సమస్య పరిష్కారానికి ఎస్ ఎస్ కెనాల్ ఒక్కటే మార్గమని వివరించారు. ఆమెతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జి రంగినేని చెంచయ్య నాయుడు, రాంబాబు నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి రమేష్‌నాయుడు, ప్రధానకార్యదర్శి హరికృష్ణ, అమర్‌నాథ్,ప్రభాకర్,మోహన్‌కృష్ణ, సర్పంచ్ రఘునాయుడు శశి, వెంకట్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

## సుపరిపాలన కావాలంటే వైకాపాను గెలిపించండి



**తొట్టంబేడు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** అటు రాష్ట్రంలోను ఇటు శ్రీకాళహస్తిలోను సుపరిపాలన కావాలంటే వైకాపాను గెలిపించాలని ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూదనరెడ్డి సతీమణి బియ్యపుశ్రీవాణి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుదవారం మండలంలోని చియ్యవరంలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆమె జగనన్న పథకాలతో లబ్ధిపొందిన వారితో మమేకమవుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ సుపరిపాలన కావాలంటే వైకాపాను గెలిపించాలని కోరారు. అనునిత్యం ప్రజాసేవలో తరిస్తున్న తన భర్త బియ్యపు మధుసూదనరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల వైకాపా సీనియర్ నాయకుడు ఉన్నంవాసుదేవనాయుడు, ఎంపిపి ఉన్నం నిర్మలమ్మ మరియు సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపిటిసి వేమాలయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ మణిబాబునాయుడు, మండల వైఎస్‌ఆర్‌సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెత్తందారీపై తిరుగుబాటు ప్రారంభం:రాష్ట్ర కార్యదర్శి



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి యొక్క పెత్తందారీ పోకడలతో నియంతృత్వ పాలనతో అణచివేతకు గురై తమ మాన ప్రాణాలను కోల్పోయిన బడుగు బలహీన వర్గాలు తమ మనుగడ కోసం అధికార వైకాపా ప్రభుత్వం యొక్క పెత్తందారీ తిరుగుబాటు ప్రారంభించారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జి.దశరధాచారి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పగ్గాలు చేపట్టిన దగ్గర నుంచి దౌర్జన్యం దోపిడీ సిద్ధాంతం ఆధారంగా పరిపాలన చేస్తూ తన రక్తదాహాన్ని తీర్చుకోవడానికి బిసిలను, దళితులను ఊచకోత కోయడానికి కూడా వెనుకాడని జగన్‌రెడ్డి పెత్తందారీ పాలనకు వ్యతిరేఖంగా రాష్ట్రంలో తిరుగుబాటు ప్రారంభం అయ్యిందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మిన్నల్‌రవి, డాక్టర్ యం.ఉమేష్‌రావు, నెమళ్ళూరు సుబ్రమణ్యం, రామచంద్రయ్య, మునిరాజ యాదవ్, బీమాల భాస్కర్, మణి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా న్యాయవాది లక్ష్మిపతి వేడుకలు



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పట్టణంలోని సీనియర్ న్యాయవాది సున్నపు లక్ష్మిపతిరెడ్డి పుట్టినరోజు వేడుకలను న్యాయవాదులు, మిత్రబృందం సమక్షంలోఆయనకార్యాలయంలో భారీ పూలమాలతో సత్కరించి కేకేచేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాది, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు అత్తింజేరిబాలాజీ సమక్షంలో పుట్టినరోజు వేడుకలును ఘనంగా నిర్వహిం చారు. పలువురు మిత్రబృందం, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బషీర్, మల్లిఖార్జున్, యువసాయి తదితరులు పాల్గొన్నారు.

## కారు భీభత్సం!



**పాలసముద్రం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలంలో బుధవారం ఓ కారు భీభత్సం సృష్టించింది. తొట్టి కండ్రిగ గ్రామ సమీపంలో వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి ఓ బైకును ఢీకొనడంతో ఇటు కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులతో పాటు బైకుపై వెళ్తున్న ఓ చిన్నారి, బైకు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో 108కు సమాచారం అందించి అతనిని చికిత్స నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జగనన్న ప్రాంతీయ జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించిన ఎంపీ

**చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ చిత్తూరు ఆర్‌విఎస్ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో జరుగనున్న ప్రాంతీయ జాబ్ మేళా పోస్టర్లను బుధవారం కలెక్టరేట్‌లో లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగు స్టేషన్‌ల తనిఖీ

**సదుం,ఫిబ్రవరి14 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను తహశీల్దారు నారాయణస్వామి ఆధ్వర్యంలో బుదవారం తనిఖీలు నిర్వహించారు. చెరకువారిపల్లెలోని పోలింగ్ కేంద్రం నెంబరు 195,196, జోగివారిపల్లె పంచాయీ పరిధిలోని పోలింగ్ కేంద్రం నెంబరు 197,198లను సిబ్బందితోకలిసి పరిశీలించారు. తాగునీటి సౌకర్యం ఉంది, ర్యాంపుల అవసరం ఉందా, నిర్మించాలా, భద్రతకు సరిపోతాయా అని విచారించారు. ఈసందర్భంగా పలువురు ఓటర్లను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ స్వామి,వీఆర్‌ఓ పురుషోత్తం,భద్ర తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ స్టాంప్ పేపర్లు తయారు చేసి నలుగురు అరెస్టు

**వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**



నకిలీ స్టాంపు తయారు చేస్తున్న కోటేశ్వర రావు, మంద పరిశుద్ధ, అబ్దుల్ రవూఫ్, నరసింహులను అరెస్టు చేసినట్లు గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, సిఐ సంగమేశ్వర రావు తెలిపారు. వెంకటగిరి సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నలుగురు వ్యక్తులు కోర్టులో బెయిల్ కోసం నకిలీ స్టాంపులు, స్టాంప్ పేపర్లు తయారు చేసి కోర్టులను మోసం చేసేవారని చెప్పారు. ఒక కేసులో బోగస్ బెయిల్ పేపర్లు సబ్మిట్ చేసినట్లు గుర్తించడంతో నిందితులను సిఐ సంగమేశ్వర రావు గాలించి పట్టుకున్నట్లు తెలిపారు. వీరు కోర్టులనే మోసం చేసేవారని చెప్పారు. ఈ కేసుల్లో ఇంకా నిదితులు ఉన్నారని వారి కోసం గాలిస్తున్నామని వివరించారు. వీరిని కఠినంగా శిక్షించాలని కోర్టును కోరుతున్నట్లు తెలిపారు. సిఐ సంగమేశ్వర రావు ఎస్ఐలు ఉన్నారు.

## దేశరక్షణలో సైనికుల విధి నిర్వహణ అమూల్యం




–పుల్వామా అమరవీరులకు ఘననివాళులు

**తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్త:** భారతదేశ సరిహద్దుల్లో దేశ రక్షణకు వీరోచితంగా పోరాడుతూ, విధులు నిర్వహిస్తున్న సైనికుల త్యాగాలు అమూల్య మని బిజెపి నాయకులు కొనియాడారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామా దాడిలో 40మంది భారత జవాన్లు అసువులు బాయడం విచారకరమని, నేటికీ వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటే వారికి ఘన నివాళులులర్పించడం పరిపాటని బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి కపిలతీర్థం వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వద్ద బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, మల్లకుప్పం శేఖర్, ప్రభాకర్‌నాయుడు, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, డిఎంకె గణేష్, చంద్రారెడ్డి, రాజారెడ్డి. పూర్ణ తదితరులు నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబాలకు బిజెపి అండగా ఉంటుందని తెలిపారు.

## జీ తెలుగుప్రేక్షకులకు

18న గదర్ 2 ప్రీమియర్ షో




**తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్త:** తెలుగుచిత్రరంగంలో వసూళ్ళసునామీ సృష్టించిన గదర్ 2 చిత్రం టెలివిజన్ ప్రీమియర్‌గా ఈనెల 18న ఆదివారం సాయంత్రం జీతెలుగులో ప్రసారమవుతుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. తెలుగు వినోదాలరంగంలో అత్యంత ఆదరణపొందిన జీ తెలుగు ఛానల్‌లో ఆదివారం సాయంత్రం బాక్సాఫీస్ వసూళ్ళసునామీ సృష్టించిన గదర్ 2 ప్రేక్షకులకు టెలివిజన్ ప్రీమియర్‌గా ప్రసారం చేస్తోందన్నారు.

## సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకు పాలన : మంత్రి రోజా



**విజయపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల ముంగిటక పాలనను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మో హనరెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. బుధవారం మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇల్లత్తూరులో రూ. 40 లక్షలతో సచివాలయ భవనం, రూ. 18 లక్షలతో రైతు భరోసా భవనం, రూ. 24 లక్షలతో వైఎస్ఆర్ వెల్‌నెస్ భవనం, రూ. 24 లక్షలతో నిర్మించిన ఒహెచ్ఎస్ఆర్ భవనాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో నాల్గో విడత ఆసరా చెక్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రజల గుండెల్లో సుస్థిరంగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అని, సచివాలయ వ్యవస్థతో పెను మార్పులు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బ్రహ్మయ్య, ఎఇఇ వీరభద్రం, వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ, మండల వైసిపి అధ్యక్షుడు గోపినాథ్, ఎంపిటిసి సరళ, సర్పంచ్‌లు గోపిరాజు, మురళీకృష్ణారెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, సురేష్, పాండ్యన్, రమేష్ ఆచ్చారి, ప్రసన్నకుమార్, వెంకటేశులు, ఎపిఎం, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

## ఓపిఎస్‌ను ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టండి

**విజయపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ఓపిఎస్‌కు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరుతూ జనసేన జిల్లా కార్యదర్శి స్వామినాథన్‌కు మండల ఉపాధ్యాయ సంఘం వినతిపత్రం అందించింది. గత ఎన్నికల్లో ఓపిఎస్ రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత ్వం పట్టించుకోలేదని తెలిపారు. ఓపిఎస్ ప్రకటించే వారికే తమ మద్దతు వుంటుందన్నారు. ఈ విషయమై స్వామినాథన్ మాట్లాడుతూ తమ రాష్ట్ర జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

## తుడా చైర్మన్ మోహిత్ రెడ్డిని కలిసిన తుడా ఇంచార్జి వైస్ విసి

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని తుమ్మలగుంట నివాసం వద్ద తుడా ఇంచార్జ్ వైస్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన వెంకటనారాయణ మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డితుడాఇంచార్జ్‌వైస్‌విసిగా బాధ్యతలు స్వీకరించిన వెంకటనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా సంజీవయ్య జయంతి వేడుకలు

–నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ



**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొని వారి చిత్రపటానికి పూలపూల సమర్పించి, పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య పిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఇలాంటి గొప్ప వారి సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని వారి అడుగు జాడల్లో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పెంచల కిషోర్, సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మేధా ఫ్యాషన్స్‌ను ప్రారంభించిన మేయర్



**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** తిరుపతి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మేధా ఫ్యాషన్స్‌ను నగర మేయర్ డాక్టర్ శిరీష బుధవారం ప్రారంభించారు. స్థానిక దొడ్డపురం వీధిలో ఏర్పాటు చేసిన షోరూమ్ వద్ద మేయర్ విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి నగరంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో, అతివలు మెచ్చే ఆకర్షణీయమైన ఎంబ్రాయిడర్, బ్లౌజులు స్టిచ్చింగ్ చేసి అందించేందుకు శ్రీ మేధా ఫ్యాషన్స్ ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. మహిళలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్స్పెక్టర్‌లు రుతు, డాక్టర్ రితేష్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే, పౌర సరఫరాలశాఖపై సమీక్షించిన కలెక్టర్



**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** రీ సర్వే, పౌర సరఫరాల శాఖ పై బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ శ అధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ మొదటి రెండవ మూడవ విడత గ్రామాల రీ సర్వే అంశాలపై పురోగతి మేరకు నిర్దేశిత గడువులోపు పెండింగ్ అంశాలు పూర్తి చేసేలా ప్రణాళికా బద్ధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా సర్వే అధికారి జయరాజ్‌కు సూచించారు. పౌర సరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్, జిల్లా మేనేజర్ పౌర సరఫరాలు సుమతి వారి శాఖ పురోగతిని కలెక్టర్‌కి వివరించారు.

## మనం అధికారంలోకి వస్తున్నాం...



–సాయినగర్ పర్యటనలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాబోతుందని...రాష్ట్ర ప్రజలందరికి మంచిరోజులు వస్తున్నాయని చంద్రగిరి ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థి పులివర్తి నాని భరోసా కల్పించారు. 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని'–'బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమాన్ని బుధవారం సాయినగర్ గ్రామ పంచాయతీలో నిర్వహించారు. సాయినగర్‌కు విచ్చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి నానిని, తిరుపతి రూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డిని సాయినగర్ టిడిపి నేతలు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ప్రజా సమస్యలతో ప్రజలు సతమౌతున్నారని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే పారదర్శక పాలన కొనసాగుతుందని తెలిపారు. టిడిపి, జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఐదు ఆలయాలకు కుంభాభిషేకాలు



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాల మరమ్మతులు పూర్తి చేసుకున్నాయి. గత రెండు సంవత్స రాలుగా ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చొరవతో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సహకారంతో 30 ఆలయాలకు కొత్తశోభను కల్పించారు. వేయిలిం గాల కోనలో వెలసిన మార్కండేయ తీర్థం, ఇటిసి కేంద్రంలో వెలసిన దుర్గేశ్వరాలయం,ఊరందూరు గ్రామంలో వెలసిన అన్నపూర్ణాదేవి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం దేవస్థానాలు మర్మమత్తులు చేసారు.వాటికి సంబంధించి కుంభాభిషేకాలు నిర్వహించుటకు తీర్మానించారు.ఈ నేపథ్యంలో అంకురార్పణ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్,కరుణాకర్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి,ఆలయ ధర్మకర్తల మండలి ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## చంద్రగిరి డిఎస్పిగా సి. శరత్ రాజ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

**తిరుపతి క్రైం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లోని డిఎస్పి కార్యాలయంలో బుధవారం చంద్రగిరి డిఎస్పిగా శరత్ రాజ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈయనల 1991 బ్యాచ్‌కు చెందిన వారని తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రికి చెందిన వారు. విశాఖపట్నం, తాడేపల్లి గూడెం, విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో చంద్రగిరి సబ్ డివిజన్ డిఎస్పిగా వచ్చారు.

## సర్వభూపాలవాహనంపై భావనాఋషీ స్వామివారి సాక్షత్కారం

**నారాయణవనం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణ వనం మేజర్ పంచాయతీ ఎగువపద్మాశాలీవీధిలో వెలసిన భద్రావతీ సమేత భావనాఋషీ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 8గంటలకు సర్వభూపాలవాహనంపై స్వామివారు ఘనంగా ఊరేగారు. మంగళ వాయిద్యాలు బాణసంచా వేడుకల నడుమ ఘనంగా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. భక్తులకు స్వామి ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఉపాధ్యక్షులు కంచి మునస్వామి, బొజ్జా మునిరాఘవులు, అర్చకులువాసుదేవనవీన్‌కుమార్‌శర్మ,ఉమ్మడిశెట్టిబొజ్జాసుబ్రమణ్యం,కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**నారాయణవనం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లాకు కొత్తగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మల్లికా గార్గ్‌ను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణపై చర్చించారు.

## మహిళ మిస్సింగ్ కేసు నమోదు!

**తిరుపతి క్రైం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో మహిళ అదృశ్యమైన కేసు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమైన వై. సుగుణ (59) భర్త వెంకటసుబ్బయ్య ఫిర్యాదు చేసారు. వివరాలు ఇలా.. రెండు రోజుల క్రితం తన పెద్ద కుమార్తెకు నిశ్చితార్థం జరిగిన పెళ్లి కుమారుడు వద్దని చెప్పడంతో మనస్థాపానికి మహిళ గురైందని తెలిపారు. మహిళ మెడలో ఉన్న మంగళ సూత్రాలను చెవికమ్మలను ఇంటిలోనే ఉంచి వెళ్లిపోయినట్లు బాధితుడు వెల్లడించారు. చుట్టుపక్క ప్రాంతాలను గాలించిన ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ ఎస్ఐ షేక్షావలి కసు నమోదు చేసారు.

## మూషిక వాహనంపై ఊరేగుతున్న గణనాథుడు

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:**

పుత్తూరు పట్టణంలోని శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, 52వ సంవత్సరం వార్షికోత్సవాలు సందర్భంగా గణనాథుడు మూషిక వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ దాతగా పుత్తూరు పట్టణానికి చెందిన శ్రీ గణపతి కలర్ అండ్ కెమికల్స్ లేట్ ఏఎం సాయిబాబా ఉభయ దాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ఎం.సుందరం, ఆలయ అర్చకులు ఎస్.రవిచంద్రన్ గురుకుల్, ఆర్.శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్యసురక్షతో సామాన్య ప్రజలకు కార్పొరేట్ వైద్యం

**కేవీబీ పురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరమని కార్పొరేట్ వైద్యాన్ని పొందుటకు ప్రభుత్వం చేసిన గొప్ప మేలని కేవీబీ పురం మండల ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి నందకుమార్, జడ్పీటీసీ మూర్తి మునెమ్మ, సుబ్బయ్యలు తెలిపారు. ఆరె సచివాలయ పరిధికి సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మెరుగైన ఔషధాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం విలేజ్ క్లినిక్ సెంటర్ కొనసాగుతుండడం, ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలు 104 ద్వారా కొనసాగుతుండడం అదే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు కొనసాగుతుండడం వలన సామాన్య గ్రామీణ ప్రజలకు అదే విధంగా ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం ప్రభుత్వం అందిస్తున్నదని వారు తెలిపారు. వైస్ ఎంపీపీలు దేరాల శ్రీనివాసయాదవ్, సరస్వతి, రమేష్, సచివాలయం కన్వీనర్ మునిరత్నం, ఢిల్లీబాబు, వైద్యాధికారి కుమార్, వైద్య బృందం పాల్గొన్నారు.

## సత్యవేడులో కార్మికులు, సీఐటీయూ కార్యకర్తల నిరసన



**సత్యవేడు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటరీ కార్మికులు గత మూడు నెలలుగా తమకు జీతాలు అందలేదని, మూడఉ నెలలుగా తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయని, అదే విధంగా ప్రభుత్వ జీవో ప్రకారం మా పీఎఫ్ ఖాతాలో కాంట్రాక్టు వారు ప్రావిడెంట్ పండు జమ చేయలేదని తమకు నాణ్యమైన పరికరాలు పనిముట్లు యూనిఫాం ఇచ్చి తమ సేవను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సీఐటీయూ కార్యకర్తలతో కలసి తమ డిమాండ్లను నెరవేర్చాలని నిరసన తెలియజేశారు. అనంతరం ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. సత్యవేడు డివిజన్ సెక్రటరీ రమేష్ మాట్లాడుతూ సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న శానిటరీ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు అందలేదని తద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని వారికి చేరవలసిన ప్రావిడెంట్ ఫండ్ చేరలేదని వారు సక్రమంగా పని చేయడానికి నాణ్యమైన పరికరాలు పనిముట్లు లేకుండా చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో సత్యవేడు శానిటరీ వర్కర్స్ చిలకమ్మ, బ్యూలా, శాంతి, నేత, మిరియమ్మ, దేవా,సోము,సీఐటీయూ కార్యకర్తలు, యువజన సంఘం నాయకుడు టి.మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నాము



**ఏర్పేడు, ఫిబ్రవరి14 ప్రభాతవార్త;** మానాన్న బియ్యపు మదుసూధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలకు సేవలు అందిస్తున్నారే తప్ప, మిగతా నాయకులు లాగా ఇక్కడ గెలిచి హైదరాబాద్‌లో కూర్చోవటం లేదని ఎమ్మెల్యే బియ్యపు మదుసూధన్‌రెడ్డి తనయ బియ్యపు పవిత్రరెడ్డి అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని కందాడ పంచాయతీ పరిధిలోని శివగిరి కాలనీ, కందాడ దళితవాడ గ్రామాల్లో ముఖ్యమంత్రి జగనన్న చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ముందుగా శివగిరి కాలనీ ఎస్టీల కోరిక మేరకు ఎమ్మెల్యే సొం నిధులతో నిర్మించనున్న వినాయక స్వామి వారి గుడి నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలోను ప్రవేశపెట్టలేదన్నారు. కరోనా కష్టకాలంలో కూడా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపలేదన్నారు. ఈకార్యక్రమాల్లో మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్ కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్, సింగిల్‌విండో చైర్మెన్ జనార్ధన్‌యాదవ్, మాజీ చైర్మెన్ నాగార్జున్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ బత్తిశెట్టి, సర్పంచిలు వీరరాఘవరెడ్డి, కవిత, మోహన్‌ప్రియా, సురేఖ, ఎంపీటీసి జనార్ధన్‌రెడ్డి, గాలి గుణశేఖర్‌నాయుడు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపి జెఏసి ఉద్యమ కార్యాచరణ షురూ..!



**చంద్రగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపి జెఏసి) ఉద్యమ కార్యాచరణ బుధవారం నుండి ప్రారంభించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ఏపి ఎన్‌జిజిఓ తాలూకా అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శి స్వర్ణలత ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖ, మెడికల్, రెవెన్యూ, విద్యాశాఖ, ఇరిగేషన్, ట్రెజరీ, ఇతర విభాగాలకు చెందిన అధికారులు తమ డిమాండ్ల సాధనకై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆగదని తేల్చిచెప్పారు. తమ నిరసన కార్యక్రమాలు అంచెలంచెలుగా పెంచుకుంటూ ఈ నెల 27న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.



## సరస్వతీ నమస్తుభ్యం

**రేణిగుంట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం గాజులమండ్యం శ్రీసాయి గణేష్ విద్యాలయంలో బుధవారం శ్రీవాణి జన్మదినం వసంత పంచమిని పురస్కరించుకుని సామూహిక సరస్వతి పూజతో పాటు, నూతనంగా విద్యనభ్యసించే విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని విద్యాసంస్థ అధినేత జువ్వల ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పిల్లలు విద్యను నేర్చుకుని విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## సుబ్బారెడ్డికి ఘనంగా వీడ్కోలు

**రేణిగుంట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** రేణిగుంట అర్బన్ సీఐ సుబ్బారెడ్డికి పట్టణంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఘనంగా వీడ్కోలు పలికారు. సుమారు రెండు సంవత్సరాలు రేణిగుంట అర్బన్ సీఐగా విధులు నిర్వహించిన సుబ్బారెడ్డి ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి ట్రాఫిక్‌కు వెళుతున్నారు. ఆయన స్థానంలో శ్రీకాళహస్తి టూ టౌన్ నుంచి మల్లికార్జున్ అర్బన్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. సుబ్బారెడ్డి బదిలీపై వెళుతున్న నేపథ్యంలో పుర ప్రముఖులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

# వేసవిలో ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి

చౌడేపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

రాబోయే వేసవిని దృష్టిలో వుంచుకొని ప్రజల సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ఎంపిపి గాజుల రామమ్మూర్తి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిపాలనా భవనంలో మండలస్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 40యేళ్ళుగా జరగని అభివృద్ధి 5యేళ్ళల్లో పరుగులు తీస్తోందనీ, ఎన్నికల సమయం కాబట్టి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన వుంటుందన్నారు. గ్రామాల్లోని ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. ముందస్తుగా పల్లెల్లోకి వెళ్ళి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై వుందని ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డిలన్నారు. గడ్డంవారిపల్లి



పంచాయతీకి సంబంధించి ఆరోగ్య అధికారిని 4నెలలుగా రాలేదనీ, దీంతో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపిటీసీ సభ్యుడు తొండా శ్రీరాములు సభ దృష్టికి తీసుకొచ్చారు. అధికారిని సెలవుపై వున్నందున మరొకరిని నియమిస్తామని వైద్యాధికారిని పూజ తెలిపారు. కుల గణనలో వింత పోకడలకు తావిస్తోందని ఎంపిడిఓ డాక్టర్ వెంకటేశు అన్నారు. కులాన్ని బట్టి మతముంటుంది కాబట్టి కొందరు వ్యక్తులు తమకు ఫోన్ చేసి అడుగుతున్నారనీ, కులం హిందుత్వంగా వుంటే వారు క్రిష్టియన్‌లుగా నమోదు చేయాలని తమను పట్టుబడుతున్నందున వారికి అర్థమయ్యే రీతిలో ప్రజాప్రతినిధులు తెలియజేయాలని ఆయన కోరారు.

అనంతరం ఆయా శాఖల పనితీరును సభలో వివరించారు. ఎంపిడిఓ డాక్టర్ వెంకటేశు, సింగిల్‌విండో, హెచ్‌డిఎస్ ఛేర్మన్లు రవిచంద్రారెడ్డి, కె.కళ్యాణ్‌భరత్, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అన్ని శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా గ్రామీణ సమస్యలను గుర్తించి సభలో పరిష్కార మార్గాలన్వేషించాల్సిన పలువురు సర్పంచులు, బాధ్యత వహించాల్సిన అధికారులు గైర్హజరయ్యారు. దీంతో సమావేశ సభలో ఖాళీ కుర్చీలు దర్శమిచ్చాయి.

## నీలకంఠేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకానికి పూజలు

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఊరందూరు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధారణ గావించారు. ఇక్కడి ఆలయ ప్రాధాన్యతను గుర్తించిన ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయాన్ని శాస్త్రోక్తంగా పునర్నిర్మాణం గావించారు. ఈ ఆలయ కుంభాభిషేకానికి బుధవారం ఆలయం వద్ద హోమాలు,కలశ స్థాపన, కుంబాభిషేకానికి అంకుర్పారణ పూజలు జరిపారు. గురువారం ఉదయం 9గంటలకు జరిగే కుంభాభిషేకం కార్యక్రమాలకు గ్రామస్థులు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు హాజరు కావాలని ఛైర్మెన్ శ్రీనివాసులు పిలుపు నిచ్చారు.ఈ పూజా కార్యక్రమాల్లో ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ కరుణాకర్ గురుకుల్, ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి వేదపండితుల, పౌరోహితులు అర్ధగిరి, పరిచారకుల గోవింద్‌శర్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసుల విస్తృత తనిఖీలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



రైల్వే డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ టి. మురళి కృష్ణ గుంత కల్, చావుండేశ్వరి సూపరింటెం డెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ గుంతకల్ వారి ఆదేశాల మేరకు షేక్‌షాను, డిఎస్ఆర్‌పి, రేణిగుంట, బిసివి రాజు, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ రైల్వే పోలీస్, రైల్వే భద్రత దళం సంయుక్తంగా కలిసి తిరుపతి రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్ సహాయంతో విస్తృత తనిఖీలు చేయడం జరిగింది. డాగ్ వాయు ప్రత్యేకంగా ప్రేలేడు పదార్థాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించుటలో శిక్షణ కలిగి ఉంది. దీని సహాయంతో శేషాద్రి ఎక్స్‌ప్రెస్ ట్రైన్లో ఎస్ 1 కోచ్‌లో మార్క్ డ్రిల్ చేయడం జరిగింది. డాగ్, ఎంతో నైపుణ్యంతో ఆ కోచ్‌లో పెట్టబడిన గంజాయిని గుర్తించడం జరిగింది. అంతేకాకుండా ప్లాట్ ఫారం పై చెత్తకుండీ పక్కన పెట్టిన పేలుడు పదార్థాన్ని కూడా గుర్తించడం జరిగింది. ఇన్స్పెక్టర్ ఆర్పిఎఫ్ కె. మధుసూదన్ మాట్లాడుతూ ప్రయాణికులు వీలైనంతవరకు విలువైన వస్తువులను తీసుకొని ప్రయాణించవద్దని, ఒకవేళ తప్పనిసరై ప్రయాణించవల్సి వచ్చినప్పుడు ఆ వస్తువులను చాలా భద్రంగా చూసుకొనవలెనని తెలియజేసారు. రాబోతున్న ఎన్నికలలో భాగంగా ఎవరైనా చట్ట విరుద్ధమైన కరెన్సీ నోట్లుగాని గంజాయిగాని మరే ఇతర మత్తు పదార్థాలను తీసుకొని ప్రయాణించిన యెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ రైల్వే పోలీస్ హేమ సుందర్ రావు, ఎస్ఐ ధర్మేంద్ర రాజు, జిఆర్‌పి, రాంబాబు, ఎస్ఐ, ఆర్పీఎఫ్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## వసంత పంచమితో కాణిపాకంకు పోటెత్తిన భక్తులు

-సర్వదర్శనానికి నాలుగు గంటల సమయం

కాణిపాకం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం బుధవారం వసంత పంచమి సందర్భంగా భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా వారంతపు రోజుల్లో అంచనాలకు మించి భక్తుల రద్దీ వుంటోంది. అయితే వసంత పంచమి సందర్భంగా కాణిపాకం దేవస్థానంలో ప్రత్యేక అక్షరాభ్యాసం కార్యక్రమంను నిర్వహించారు. దీనితో తన పిల్లలకు గణనాధుని చెంత ఓనమాలు దిద్దించడానికి రాష్ట్రం నలుగూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు బారీ ఎత్తున తరలివచ్చారు. అక్షరాభ్యాసం అనంతరం భక్తులు స్వామివారి దర్శనానికి రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది, ఉదయం నుండి రాత్రి వరకు ఆలయంలో రద్దీ కొనసాగింది. ఆలయలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే భక్తులు వచ్చిన వివిధ రకాల వాహనాలతో కాణిపాకం పరిసరాలు, వాహన పార్కింగ్‌లు పూర్తిగా నిండిపోయాయి. ఉదయం నుండి రాత్రి వరకు సుమారు 25 వేల మందికి పైగా స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులఅంచనా. రద్దీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

## శ్రీసాయిసుధా ఇంగ్లీషు మీడియం స్కూల్లో 'వసంత పంచమి' వేడుకలు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:



జన్మనిచ్చిన తల్లి ఒడి నుంచి చదువుల తల్లి సరస్వతి ఒడిలోకి ప్రయాణించే ప్రక్రియే అక్షరాభ్యాసమని శ్రీసాయిసుధా ఇంగ్లీషు మీడియం హై స్కూల్ అధినేత్రి డాక్టర్ సుధారాణి వివరించారు. తుమ్మలగుంట నలంద నగర్‌లో ఉన్న శ్రీ సాయి సుధా ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో వసంత పంచమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సరస్వతి అమ్మవారి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేసారు. సరస్వతి జన్మదినం రోజైన వసంత పంచమి రోజున పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడంతో పిల్లలపై అమ్మవారి కటాక్షం ఉంటుందని డాక్టర్ సుధారాణి తెలిపారు. పిల్లలకు పలక బలపం అందజేసి ఓం నమశ్శివాయ సిద్ధం నమ: అనే భీజాక్షరాలు వ్రాయించి,అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, మేనేజర్ పుష్ప, ఉపాధ్యాయులు వనిత, శారద, శోభ, రాధ, భువనేశ్వరి, శిల్ప, జీవ, భువనేశ్వరరెడ్డి, మౌళిక, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల సాధనకై ఏపి జెఏసి పిలుపుమేరకు నిరసన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త




ప్రభుత్వంతో రాష్ట్ర నాయకులు చర్చలు పిలుపు మేరకు బుధవారం ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు సమస్యల సాధనకోసం జెఏసి పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని భోజన విరామ సమయంలో శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికుల శ్రీకాళహస్తి తాలూకా ఎన్జీవోఅధ్యక్షులు, జెఏసి ఛైర్మన్ సి.చెంచురత్నం యాదవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చెంచురత్నం యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వంతో రాష్ట్ర నాయకులు చర్చలు విఫలం కావడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, ఉద్యమ శంఖారావం పేరుతో దశలవారీగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యలకు గత ఐదేళ్ళుగా ఎలాంటి పరిష్కారం చూపలేదన్నారు. సమస్యలు పరిష్కారం సమక్షంలో ఈనెల 27న ఛలో విజయవాడ కార్యక్రమం ఉంటుందని దీనికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది మునిరత్నమ్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జెఏసి ఛైర్మన్ సి.చెంచురత్నం యాదవ్, నాగరాజు, సూర్యప్రకాష్, మురళీ, జయరాం, వెంకయ్య, ఈశ్వరయ్య, గణేష్, హేమలత, మాధవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్పీగా ఉమామహేశ్వరరెడ్డి బాధ్యతల స్వీకరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు వెస్ట్ సబ్‌డివిజన్‌లో డిఎస్పీగా పనిచేస్తున్న బి.ఉమామహేశ్వరరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంగా బదిలీల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. గతంలో ఈయన అనంతపురం జిల్లా మరియు సత్యసాయి పుట్టపర్తి జిల్లాల్లో ఎస్‌బి డిఎస్పీగా పనిచేసి శ్రీకాళహస్తికి బదిలీపై విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో విధులు నిర్వహించడంకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా డిఎస్పీకి అర్బన్ సిఐ నరసింహారావు, టుటౌన్ సిఐ మల్లికార్జున, రూరల్ సిఐ అజయ్, బిఎన్‌కండ్రిగ సిఐ శ్రీహరి, ఎస్ఐ నరసింహం, తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తదితరులు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.

## సింగిల్‌విండో తరపున మెడికల్ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్యే

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



పేద ప్రజలకు చేరువలో సేవలందించే ప్రభుత్వం జగనన్నది అని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. నియోజవర్గంలోని రైతుల సంక్షేమానికి ఓ వైపు సింగిల్ విండోల ద్వారా, అలాగే మేలు రకం విత్తనాలను అందించటానికి ఎపి సీడ్స్ ద్వారా సేవలందిస్తున్నట్లు వివరించారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలోనే శ్రీకాళహస్తి వ్యవసాయక ప్రాధాన్యతకల్గిన నియోజకవర్గంగా శ్రీకాళహస్తి గుర్తింపబడిందని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సహకారం సంఘంను తాను గెలిచిన తరువాత సొంత భవనాలను ఏర్పాటు చేసామన్నారు. యువకుడు రైతు సమస్యల పట్ల అవగాహన ఉన్న చెవిరెడ్డి మధుసూధనరెడ్డికి సింగిల్ విండో బాధ్యతలను అప్పగించామని ఆయన సమర్ధవంతంగా రైతుల అవసరాలను తతీర్చుతున్నారని వివరించారు.అలాగే నేడు ఇక్కడ ఔషధాలయాన్ని ఏర్పాటు చేయటం గమనిస్తే రైతుల పట్ల ఆయనకు గల గుర్తింపుకు నిదర్శనం అన్నారు.ఈ కార్యక్రమాలకు ఛైర్మెన్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి అధ్యక్షత వహించగా మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ వయ్యాల కృష్ణా ఒరెడ్డి, గంగిరెడ్డి రామచంద్రారెడ్డి, రంగయ్య, పసల కృష్ణయ్య,ఫజల్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.ఈ షాపు రైతులకు తగిన ధరలకు మందులను అందిస్తుందని వివరించారు.

## పి.కొత్తకోట హాస్టల్ వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు

చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: పూతలపట్టు మండలం పి.కొత్తకోట ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ సురేష్‌పై కలెక్టర్ సగిలి షన్మోహన్ సస్పెన్షన్ వేటు వేశారు. పి.కొత్తకోట ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్‌పై పలు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ సగిలి షన్మోహన్ జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీని విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు హాస్టల్ వెళ్ళి విచారించిన ఆమెకు హాస్టలల్ వార్డెన్‌పై అక్కడి, సిబ్బంది పలు వాస్తవాలను వెల్లడించారు. మెను ప్రకారం భోజనం పెట్టడం లేదని, హాస్టల్ వార్డెన్ జి.సురేష్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, హాస్టల్‌లో మరుగుదొడ్లను సైతం శుభ్రంగా వుంచడం లేదని, హాస్టల్ వార్డెన్‌తో పాటు వాచ్‌మెన్ సైతం సక్రమంగా విధులకు హాజరు కారని విద్యార్థులు ఆమెకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారిత అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ ఇచ్చిన విచారణ నివేదిక మేరకు కలెక్టర్ సగిలి షన్మోహన్ హాస్టల్ వార్డెన్ పి.సురేష్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

## చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

- అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి

గూడూరు రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



అరాచక పాలనకు చరమగీతం పాడాలని, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయుడితోనే సాధ్యమనా మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి పాశిం సంధ్యారాణి అన్నారు. బుధవారం బాబు షూరిటీ భవిషనయత్‌కి గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. గూడూరు పట్టణం 7వ వార్డు అశోక్‌నగర్ ప్రాంతంలో స్థానిక ప్రజలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన గురించి వివరించారు. ఆమె మాట్లాడుతూ నవరత్నాల పేరుతో అందరినీ వైసీపీ మోసం చేసిందన్నారు. రాష్ట్రం, గూడూరు నియోజకవర్గంలో తిరిగి అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, ఎమ్మెల్యేగా పాశిం సునీల్‌కుమార్ గెలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, అరికట్ల మస్తాన్‌నాయుడు, పచ్చల నరసింహనాయుడు, ఎన్.నరసింహులు, యదనపర్తి జనార్ధన్‌రెడ్డి, గాయం రమణయ్య, ఏసుపాక పెంచలయ్య, అమరయ్య నాయుడు, మహిళలు గుండాల లీలావతి, మట్టం శ్రావణిరెడ్డి, గుండాల భారతి, సుధ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిని రాజధానిగా చేయాలి

–మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :




తిరుపతి ప్రాంతం రాజధాని ఏర్పాటుకు ఎంతగానో అనుకూలమైనదని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్ తెలిపారు. వెంకటగిరి పోలేరమ్మ గుడి కూడలి వద్ద ఆయన జాతీయ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతి నుండి రాపూర్ వరకు లక్ష ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఎక్కడా కొనాల్సిన అవసరం లేదని తెలిపారు. రాయలసీమ ప్రాంత వాసులకు రాళ్లు ఇచ్చి కోనసీమ కోస్తా జిల్లాల వారికి నీళ్ళు ఇస్తారని ఆవేదన వ్యక్తం చేసారు. కృష్ణ, గోదావరి జిల్లాలు పుష్కలంగా ఉన్నాయని అక్కడ రైతులు ఆ ప్రాంతవాసులు కోటీశ్వరులని తెలిపారు. రాయలసీమ జిల్లాల ప్రాంతాల వారు రాళ్ల తిని బతకాలని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు అమరావతిలో రాజధాని పెట్టాలని జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నంలో పెట్టాలని ప్రయత్నాలు చేయడం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంట శ్రీనివాసులురెడ్డి, నాయకులు పూల చంద్రశేఖర్, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తేజవతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్ఎల్‌వి ఎఫ్14 రాకెట్ ప్రయోగానికి లాంచ్ రిహార్సల్స్

శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



శ్రీహరికోట నుంచి ఈ నెల 17న ప్రయోగిస్తున్న జిఎస్ఎల్‌వి ఎఫ్14 రాకెట్ ప్రయోగానికి సంబంధించి బుధవారం లాంచ్ రిహార్సల్స్ నిర్వహించారు. గురువారం ఈ ప్రయోగానికి సంబంధించిన కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. 17న సాయంత్రం 5.30 గంటలకు జిఎస్ఎల్‌వి ఎఫ్14 రాకెట్ ద్వారా భారత సమాచార ఉపగ్రహం ఇన్‌శాట్ 3డిఎస్‌ను ప్రయోగిస్తున్నారు. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రయోగానికి రెండురోజులు ముందుగానే వచ్చి ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు.

## చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరికలు

కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



గుడుపల్లె మండలంలో అధికార వైకాపా పార్టీకి ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు షాక్ ఇచ్చారు. బుధవారం వీరు ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అధ్వర్యంలో తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గుడుపల్లె మండల వైస్ ఎంపిపి యువలక్ష్మి హేమేంద్ర (బుజ్జి), మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణ్యంతో సహా సుమారు యాభై మంది వైకాపా కార్యకర్తలు చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరారు. వీరిని చంద్రబాబు నాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కుప్పంలో ఈసారి చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ సాధించేందుకు తమవంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈసందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి తప్పక గుర్తింపు ఇస్తామన్నారు. మరలా అధికారంలో వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో గుడుపల్లె టిడిపి అధ్యక్షుడు బాబునాయుడు, సర్పంచ్ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## నూతన అంగన్‌వాడీ భవనం ప్రారంభం

సత్యవేడు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:



శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో(సీఎస్ఆర్) భాగంగా శ్రీసిటీలోని పార్భ్వన్ ప్యాకేజింగ్ పరిశ్రమ యాజమాన్యం మండలంలోని మల్లవారిపాళెం వెస్ట్ గ్రామంలో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించి అంగన్‌వాడీ సిబ్బందికి అందజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్భ్వన్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ సెంథిల్, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా, పార్భ్వన్ ఫైనాన్స్ హెడ్ సంతోష్, హెచ్‌ఆర్ మేనేజర్ ప్రభుచందర్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, మల్లవారిపాళెం గ్రామస్థులు పాల్గొన్నారు. నూతన భవనంతో పాటు అదే ఆవరణలోని పాత అంగన్‌వాడీ భవనం, మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు. మొత్తంగా నూతన భవనం, మరమ్మతుల కోసం 18.5 లక్షల రూపాయల వ్యయం చేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల విద్యావసతుల కోసం సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టడం పట్ల పార్భ్వన్ ప్లాంటు హెడ్ సెంథిల్ ఆనందం వ్యక్తంచేశారు.గతంలోను గొల్లవారిపాళెం, తొండూరు గ్రామాల్లో అదనపు తరగతి గదులు, ఇరుగుళం హైస్కూలులో మరుగుదొడ్లు నిర్మించినట్లు ఆయన గుర్తు చేశారు. భవిష్యత్‌లోఈ తరహా మరిన్ని కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతామని తెలిపారు. వితరణ పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో పార్భ్వన్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. విద్యపట్ల వారికున్న శ్రద్ధ, నిబద్ధతను కొనియాడారు. మరిన్ని కంపెనీలు చురుగ్గా ఈ తరహా కార్యక్రమాలు చేసేందుకు ఇదొక ప్రేరణగా నిలుస్తుందన్నారు. శ్రీసిటీ ఫౌండేషన్, పార్భ్వన్ కంపెనీ యాజమాన్యానికి మల్లవారిపాళెం గ్రామస్థులు, అంగన్‌వాడీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పాత అంగన్‌వాడీ భవనంతో పలు ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ప్రస్తుతం కొత్త భవనంలో పాటు పాత భవనం కూడా మరమ్మతులకు నోచుకోవడం సంతోషంగా ఉందన్నారు.

## ఏనుగుల దాడులు తస్మాత్ జాగ్రత్త!

రైతుపై ఏనుగు దాడి..పొలం ధ్వంసం–డిఆర్ఓ చినబాబు

చంద్రగిరి, ఫిబ్రవరి 14 ప్రభహతవార్త:



అటవీ ప్రాంతాల నుండి వ్యవసాయ పొలాల వద్దకు వస్తున్న ఏనుగులు దాడులు చేసే ప్రమాదం వుందని తస్మాత్ జాగ్రత్త అంటూ డిఆర్ఓ చినబాబు రైతులకు హితవు పలికారు. మండల పరిధిలోని యల్లంపల్లి వద్ద మనోహర్ రెడ్డి అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద మంగళవారం రాత్రి నిద్రిస్తుండగా ఓ ఏనుగు దాడి చేయడంతో పాటు పొలాన్ని ధ్వంసం చేసింది. సమాచారం అందుకున్న డిఆర్ఓ సంఘటనా స్థలికి చేరుకుని రైతును తిరుపతి రుయాకు తరలించి, పరీక్షలలో చేయి విరిగినట్లు తేలడంతో వైద్య చికిత్సల అనంతరం ఇంటికి చేర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు సూచనలు చేసినప్పటికీ రైతులు పొలం వద్ద నిద్రించడం ప్రమాదకరమన్నారు. అదేవిధంగా రైతులు తమ పొలంలో జంతువుల నుండి రక్షణ కోసం విద్యుత్ (షాక్‌కై) తీగలు లాగవద్దని హెచ్చరించారు. ఇలా చేయడం వలన రైతులు సైతం మరణించే ప్రమాదం వుందన్నారు. ఏనుగుల నుండి మీ పంట పొలాలను రక్షించేందుకు అవసరమైన మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు వెళ్ళడించిన ఆయన రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఓ శంకరప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుచానూరు రైతు బజారు ప్రారంభం

-చంద్రగిరి నియోజకవర్గంలోనే తొలి రైతు బజారు

-రూ. 45 లక్షలతో 72 దుకాణాలు ఏర్పాటు

-తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుచానూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :



రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మధ్యవర్తల ప్రమేయం లేకుండా వినియోగదారులకు నేరుగా విక్రయించేందుకు రైతుల బజార్లు దోహదం చేస్తాయని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మార్కెట్ యార్డ్ ఆవరణంలో రూ. 45 లక్షలతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తిరుచానూరు రైతు బజారును ఆయన ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వేడుకగా నిర్వహించారు. ముందుగా మోహిత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. తరువాత శిలాఫలకం ఆవిష్కరించి చెవిరెడ్డి మోహత్ రెడ్డి దుకాణాలను ప్రారంభించారు. దుకాణదారుల నుండి కూరగాయలను మోహిత్ రెడ్డి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు రైతులు, వినియోగదారుల కోసం రైతు బజారు నిర్మాణానికై చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దాదాపు ఎకరా స్థలంలో రైతు బజారు ఏర్పాటు అభినందనీయమని కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గంలో మొట్టమొదటి సారిగా రైతు బజారు మోడల్‌గా నియోజకవర్గంలో మరిన్ని రైతు బజార్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తిరుపతి రూరల్ రామచంద్రాపురం మండలాలకు చెందిన రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. రైతు బజారు ఏర్పాటుకు గత మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీ విద్య గణపతి నాయుడు చేసిన కృషిని కొనియాడారు. ఈ రైతు బజారును రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మావతిపురం మాజీ సర్పంచ్ గణపతి నాయుడు, వైస్ఎంపిపి విడుదల మాధవరెడ్డి, చంద్రగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి జానకిరామ్, శ్రీనివాసపురం సర్పంచ్ పద్మ, పద్మావతిపురం సర్పంచ్ రాజేంద్ర, పార్టీ డివిజన్ అధ్యక్షులు మహి, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ అయప్ప తదితరులు పాల్గొన్నారు.